www.aptodaynews.com
తెలుగు దినపత్రిక
రేపటి కోసం...
ఎపి టుడే
AP TODAY NEWS న్యూస్

విలేకరులు కావలెను.
ఎపి టుడే AP TODAY NEWS న్యూస్
ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న ఎపి టుడే న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
-: సంప్రదించండి :-
8520060508

పబ్లిషర్ : ఆంధ్రప్రదేశ్,తెలంగాణ.. సంపుటి : 01 సంచిక : 247 ఎడిటర్ : సాని మనోజ్ కుమార్ పేజిలు : 4, వెల రూ. 5, /- గురువారం -19 - జూన్ - 2025

## కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు...
# రేవంత్, చంద్రబాబు విచారణను వేగవంతం చేయాలి




తన వ్యక్తిగత సంభాషణలు దొంగచాటుగా విన్నారన్న షర్మిల

ఇది వ్యక్తిగత గోప్యతకు, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్య




## రేవంత్ రెడ్డి ఆ పని చేస్తేనే నామినేషన్లు వేయనిస్తాం

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న కవిత
- బీసీ రిజర్వేషన్లకు రేవంత్ అనుమతి తీసుకురావాలని డిమాండ్
- మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని సూచన

## తెలంగాణ రైతుల ప్రయోజనాలకు
# ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఉత్తమ్ కుమార్‌రెడ్డి

గోదావరి–బనకచర్లపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి

## ఫీజిబులిటీ నివేదిక సమర్పించింది




"గోదావరి–బనకచర్లపై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నాం

హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అఖిలపక్ష ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, మిగతా..2లో

## జీ7 వేదికగా ఏఐ డీప్‌ఫేక్‌లపై ప్రధాని మోదీ ఆందోళన

ఏఐ రూపొందించిన కంటెంట్‌కు వాటర్‌మార్క్ ఉండాలని సూచన

ఏఐ సమస్యల పరిష్కారానికి ప్రపంచస్థాయి పాలన అవశ్యమని ఉద్ఘాటన




పునరుత్పాదక ఇంధన వనరులతోనే సాంకేతికత ఆధారిత సమాజ నిర్మాణం సాధ్యమని వెల్లడి

భారత్ టెక్నాలజీని ప్రజలకు చేరువ చేసి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిందని వివరణ

# కూటమి గెలిచాక వారిని
# ఊరు విడిచి వెళ్లిపోమన్నారు
## పల్నాడు జిల్లాలో జగన్ తీవ్ర ఆరోపణలు

- పల్నాడు జిల్లా రెంటపాళ్లలో మాజీ సీఎం జగన్ పర్యటన
- ఆత్మహత్య చేసుకున్న ఉపసర్పంచ్ నాగమల్లేశ్వరరావు కుటుంబానికి పరామర్శ
- ఏపీలో అభివృద్ధి, సంక్షేమం లేవని, 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తోందని విమర్శ
- నాగమల్లేశ్వరరావును బెదిరించిన సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



పల్నాడు జిల్లా : రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, రెంటపాళ్ల గ్రామానికి చెందిన కోర్లకుంట వెంకటేశ్వరరావు కుటుంబానికి జరిగిన అన్యాయమే దీనికి నిదర్శనమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన రెంటపాళ్లలో పర్యటించి, ఆత్మహత్యకు పాల్పడిన నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు.

"పోలీసు వేధింపులతోనే ఆత్మహత్య"

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ రోజున రెంటపాళ్ల ఉపసర్పంచ్‌గా ఉన్న నాగమల్లేశ్వరరావుపై తెలుగుదేశం, జనసేన నాయకులు తప్పుడు ఆరోపణలు చేశారని జగన్ ఆరోపించారు. ఆ ఆరోపణలతో పోలీసులు ఆయనను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్రంగా అవమానించారని అన్నారు. ఎన్నికల్లో కూటమికి అనుకూల ఫలితాలు వచ్చిన తర్వాత నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడులు చేసి, ఊరు విడిచి వెళ్లిపోవాలని, లేకపోతే రౌడీ షీట్ తెరుస్తామని స్వయంగా సీఐ బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. "జూన్ 5వ తేదీ రాత్రి పోలీసులు నాగమల్లేశ్వరరావును వదిలిపెట్టగా, ఆయన నేరుగా గుంటూరులోని తన సోదరుడి ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి తన తండ్రి వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసి, పోలీసులు తనను బెదిరించిన తీరును వివరించారు. పోలీసుల వేధింపుల వల్లే నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తండ్రి ఎంత ప్రయత్నించినా కుమారుడిని మిగతా..2లో

## భారత్-పాక్ ఒప్పందంలో మీ ప్రమేయం లేదు: ట్రంప్‌తో మోదీ స్పష్టం

'జీ7 శిఖరాగ్ర సదస్సు అనుబంధంగా ప్రధాని మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీ




ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత ట్రంప్.. మోదీకి ఫోన్ చేసి సంతాపం

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అండగా ఉంటామన్నారు

# గోదావరి - బనకచర్లకు
# ఆనాడే అంకురార్పణ జరిగింది
## రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేది లేదు


రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్టు నమస్తే తెలంగాణలో రాశారు

తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యం

"21-9-2016న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించింది



హైదరాబాద్: 2019 అక్టోబరులో కేసీఆర్, జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించటంపై చర్చించుకున్నారు.. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే అంకురార్పణ జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు విషయంపై అఖిలపక్ష ఎంపీలతో సమావేశం అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్టు నమస్తే తెలంగాణలో రాశారు







## ఫాస్టాగ్ వార్షిక పాస్.. ఇదో గేమ్ ఛేంజర్: పవన్ కల్యాణ్

ఫాస్టాగ్ వార్షిక పాస్‌ల ప్రకటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం

ఇది రహదారి ప్రయాణంలో గొప్ప మార్పు తెస్తుందన్న పవన్

రూ. 3వేల పాస్‌తో వాహనదారులకు ఆర్థిక వెసులుబాటు

## కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి
# చిరాగ్ పాశ్వాన్‌తో మంత్రి లోకేశ్ భేటీ

కేంద్రమంత్రి పాశ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన లోకేశ్

రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం అందిస్తామని పాశ్వాన్ హామీ

'యువగళం' పుస్తకాన్ని చిరాగ్ పాశ్వాన్‌కు అందించిన లోకేశ్



అమరావతి: పండ్లతోటల అభివృద్ధికి అన్నివిధాల అనుకూలమైన వాతావరణం కలిగిన రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్ కు మంత్రి మిగతా..2లో

## నకిలీ కరెన్సీ కేసులో విదేశీయుడికి బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నో.. కీలక వ్యాఖ్యలు
# నకిలీ కరెన్సీ కేసులో విదేశీ నిందితుడికి సుప్రీంకోర్టులో చుక్కెదురు




బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం

ఇలాంటి చర్యలు ఆర్థిక వ్యవస్థకు పెను విఘాతమని తీవ్ర వ్యాఖ్యలు

నిందితుడి నుంచి రూ.8 లక్షల నకిలీ నోట్లు, పరికరాలు స్వాధీనం

నిందితుడు పరారయ్యే అవకాశం ఉందని కోర్టు ఆందోళన వ్యక్తం

నేరం రుజువైతే దీర్ఘకాల శిక్ష పడే అవకాశం ఉందని వెల్లడి

## హైదరాబాద్‌లో గూగుల్ సంస్థకు
# మా 'వాళ్లే' పోటీ!

హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

డిజిటల్ భద్రతే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని వెల్లడి

నైపుణ్యాభివృద్ధికి రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్న సీఎం

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి



హైదరాబాద్: హైటెక్ సిటీలో గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికి సమీపంలోనే ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ మిగతా..2లో




## బ్రిటన్ మాజీ ప్రధానితో భేటీ కానున్న రేవంత్ రెడ్డి

ఢిల్లీకి పయనమవుతున్న రేవంత్ రెడ్డి

రెండు రోజుల పాటు ఢిల్లీలో బిజీగా గడపనున్న సీఎం

పెట్టుబడులే లక్ష్యంగా టోనీ బ్లెయిర్ తో చర్చలు


# స్టార్‌లింక్‌కు భారత్ లైసెన్స్..
## కేంద్రమంత్రితో స్పేస్ఎక్స్ ప్రెసిడెంట్ కీలక సమావేశం

స్పేస్ఎక్స్ ప్రెసిడెంట్ గ్విన్ షాట్‌వెల్‌తో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా భేటీ

భారత్‌లో స్టార్‌లింక్‌కు లైసెన్స్ ఇవ్వడాన్ని ప్రశంసించిన షాట్‌వెల్

శాటిలైట్ కమ్యూనికేషన్లలో సహకారంపై ఫలవంతమైన చర్చలు

దేశంలో జీఎంపీసీఎస్ అనుమతి పొందిన మూడో శాట్‌కామ్ కంపెనీగా స్టార్‌లింక్




మారుమూల ప్రాంతాలకు హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించడమే లక్ష్యం

కొత్త జాతీయ భద్రతా మార్గదర్శకాలకు అనుగుణంగా స్టార్‌లింక్‌కు అనుమతి




## అమిత్ షాతో
## మంత్రి నారా లోకేశ్ భేటీ

రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురి మధ్య చర్చ

సాయంత్రం మరికొందరు కేంద్ర మంత్రులతో లోకేశ్ భేటీ అయ్యే అవకాశం

# హైదరాబాద్‌లో గూగుల్ సంస్థకు మా 'వాళ్లే' పోటీ!

మొదటి పేజీ తరువాయి

బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను (జీఎస్ఈసీ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచం వేగంగా డిజిటల్ యుగం వైపు పయనిస్తోందని, ఈ నేపథ్యంలో డిజిటల్ సమాచార భద్రత ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజల డిజిటల్ సమాచారం సురక్షితంగా ఉన్నప్పుడే వారు క్షేమంగా ఉన్నట్లు భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. డిజిటల్ భద్రతను పెంపొందించడమే ఈ కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే పని చేస్తుంది. రాష్ట్రంలో యువత నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం" అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా మారుతోందని, అందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమని వివరించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. "ఇక్కడి మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, ధనిక పెట్టుబడిదారులకు దీటైన పోటీదారులుగా ఎదుగుతున్నారు. ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు, వినూత్న విధానాలు తీసుకొస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

## తెలంగాణ రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఉత్తమ్ కుమార్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి




సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలతో పాటు, భాజపా ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు, భారాస ఎంపీ రవిచంద్ర, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. "గోదావరి-బనకచర్లపై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నాం. రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. గోదావరి-బనకచర్లపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ఫీజిబులిటీ నివేదిక సమర్పించింది" అని వివరించారు.

## స్టార్‌లింక్‌కు భారత్ లైసెన్స్.. కేంద్రమంత్రితో స్పేస్‌ఎక్స్ ప్రెసిడెంట్ కీలక సమావేశం

ఢిల్లీ: భారత్‌లో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలను అందించేందుకు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన స్టార్‌లింక్‌కు లైసెన్స్ మంజూరు కావడంపై ఆ సంస్థ హర్షం వ్యక్తం చేసింది. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా బుధవారం స్పేస్‌ఎక్స్ ప్రెసిడెంట్ అండ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) గ్విన్ షాట్‌వెల్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీ ఫలవంతంగా జరిగిందని, భారత్‌లో స్టార్‌లింక్‌కు లైసెన్స్ ఇవ్వడాన్ని షాట్‌వెల్ ప్రశంసించారని మంత్రి తెలిపారు. ఈ సమావేశం గురించి కేంద్ర మంత్రి సింధియా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "భారతదేశంలో కనెక్టివిటీ రంగంలో తదుపరి దశకు సంబంధించి స్పేస్‌ఎక్స్ ప్రెసిడెంట్ అండ్ సీఓఓ గ్విన్ షాట్‌వెల్‌తో ఫలవంతమైన సమావేశం జరిగింది. డిజిటల్ ఇండియా యొక్క అపారమైన ఆకాంక్షలకు ఊతమివ్వడానికి, దేశంలోని ప్రతి పౌరుడికి సాధికారత కల్పించడానికి శాటిలైట్ కమ్యూనికేషన్లలో సహకార అవకాశాలపై లోతుగా చర్చించాం" అని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం డిజిటల్ విప్లవంలో దూసుకుపోతోందని, ఈ తరుణంలో శాటిలైట్ సాంకేతికతలు కేవలం సంబంధితమైనవి మాత్రమే కాకుండా, పరివర్తనాత్మకమైనవని సింధియా అభిప్రాయపడ్డారు. స్టార్‌లింక్‌కు లైసెన్స్ మంజూరు చేయడం ఈ ప్రయాణంలో గొప్ప ప్రారంభమని షాట్‌వెల్ అన్నట్లు మంత్రి తెలిపారు. తక్కువ భూకక్ష్య ఉపగ్రహాలను ఉపయోగించి మారుమూల ప్రాంతాలకు కూడా హై-స్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించడమే స్టార్‌లింక్ లక్ష్యం. ఈ నెల ప్రారంభంలో స్టార్‌లింక్ సంస్థకు దేశంలో వాణిజ్య సేవలు అందించేందుకు వీలుగా శాట్‌కామ్ లైసెన్స్ లభించిన విషయం తెలిసిందే. బహుశా ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో స్టార్‌లింక్ తన సేవలను ప్రారంభించవచ్చని భావిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, టెలికమ్యూనికేషన్ల విభాగం (డాట్) ఈ అమెరికన్ కంపెనీకి గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్ బై శాటిలైట్ (జీఎంపీసీఎస్) అనుమతిని జారీ చేసింది. స్టార్‌లింక్ సంస్థ తన ఆసక్తి వ్యక్తీకరణ పత్రంలో (ఎల్ఓఐ) పేర్కొన్న అన్ని భద్రతా నిబంధనలను పాటించినందున, రాబోయే రోజుల్లో ట్రయల్ స్పెక్ట్రమ్ కూడా జారీ చేసే అవకాశం ఉంది. యూటెల్‌శాట్ వన్‌వెబ్, జియో-ఎస్ఈఎస్ తర్వాత, దేశంలో జీఎంపీసీఎస్ అనుమతి పొందిన మూడవ శాట్‌కామ్ కంపెనీగా స్టార్‌లింక్ నిలిచింది. శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలకు స్పెక్ట్రమ్ కేటాయించడానికి ముందు, స్టార్‌లింక్ ఇప్పుడు ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్) నుండి ఆమోదం పొందాల్సి ఉంది. దీనికి సంబంధించిన అవసరమైన పత్రాలను ఇప్పటికే సమర్పించింది.

## కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు... రేవంత్, చంద్రబాబు విచారణను వేగవంతం చేయాలి

అమరావతి: తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ లపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను ట్యాప్ చేశారని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆమె మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో వైఎస్ షర్మిల మాట్లాడుతూ, "ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా?" అంటూ వైఎస్ జగన్‌ను ఉద్దేశించి తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో తన ఫోన్‌ను నిరంతరం ట్యాప్ చేశారని ఆమె ఆరోపించారు. కేవలం రాజకీయ ప్రత్యర్థి అయినందుకే తన వ్యక్తిగత సంభాషణలను కూడా దొంగచాటుగా విన్నారని, ఇది వ్యక్తిగత గోప్యతకు తీవ్ర భంగం కలిగించడమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలకు కూడా విఘాతమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ఫోన్ ట్యాపింగ్ తతంగం నడిచిందని షర్మిల ఆరోపించారు. "ఒక మహిళ అని కూడా చూడకుండా, ఒక రాజకీయ నాయకురాలిగా నా కార్యకలాపాలను అడ్డుకోవడానికి, నా వ్యూహాలను తెలుసుకోవడానికి ఇంత నీచమైన చర్యలకు పాల్పడ్డారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆమె దుయ్యబట్టారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని అన్నారు. అధికారంలో ఉన్నవారు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రత్యర్థులపై నిఘా పెట్టడం, వారి సంభాషణలను రహస్యంగా వినడం వంటివి చట్టవ్యతిరేకమని, నైతికంగా కూడా తప్పని ఆమె స్పష్టం చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్రమైన విచారణ జరిపించాలని, ఇందులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆమె హితవు పలికారు. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యతను కాపాడటంలో ప్రభుత్వాలు విఫలమైతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆమె హెచ్చరించారు. గతంలో వైవీ సుబ్బారెడ్డి సైతం ట్యాపింగ్ విషయాన్ని ధ్రువీకరించి, ఓ ఆడియోను తనకు వినిపించారని షర్మిల వెల్లడించారు. తెలంగాణలో తనను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకే కేసీఆర్, జగన్ కలిసి ఈ కుట్ర పన్నారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ఘటనపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు తక్షణం విచారణను వేగవంతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేసీఆర్ కోసం జగన్ తనను రాజకీయంగా అణచివేయాలని చూశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. విచారణకు ఎప్పుడు పిలిచినా తాను హాజరవుతానని స్పష్టం చేశారు.

## జీ7 వేదికగా ఏఐ డీప్‌ఫేక్‌లపై ప్రధాని మోదీ ఆందోళన

ఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిజ్ఞానం వల్ల తలెత్తుతున్న సవాళ్లు, ముఖ్యంగా డీప్‌ఫేక్‌ల వ్యాప్తిపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కెనడాలోని ఆల్బెర్టాలో జరుగుతున్న జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఏఐ ద్వారా రూపొందించే కంటెంట్‌కు తప్పనిసరిగా వాటర్‌మార్కింగ్ ఉండాలని లేదా అది ఏఐ సృష్టించినదనే స్పష్టమైన ప్రకటన ఉండాలని అభిప్రాయపడ్డారు. సమాజంపై ఏఐ చూపిస్తున్న ప్రభావం గురించి ప్రస్తావిస్తూ, ఈ సాంకేతికతకు సంబంధించిన సమస్యలను తగ్గించడానికి ప్రపంచవ్యాప్తంగా సమగ్రమైన పాలనా వ్యవస్థ అవసరమని ప్రధాని మోదీ సూచించారు. ప్రస్తుత యుగం ఏఐదే అయినప్పటికీ, సాంకేతికతతో కూడిన వ్యవస్థలను సురక్షితంగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆయన నొక్కిచెప్పారు. డీప్‌ఫేక్ కంటెంట్ వల్ల తలెత్తే ప్రమాదాలను తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటు ధరల్లో, నమ్మకమైన, స్థిరమైన సాంకేతిక వ్యవస్థలను అందించడమే భారత్ ప్రధాన లక్ష్యమని మోదీ స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు ప్రయోజనం చేకూర్చినప్పుడే దానికి నిజమైన విలువ ఉంటుందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ఏ దేశాన్ని కూడా వెనుకబడనివ్వకూడదని ఆయన అన్నారు. భారత్ తన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజాస్వామ్యబద్ధం చేసిందని, తద్వారా ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా సామాన్య ప్రజలను కూడా శక్తివంతం చేసిందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సమగ్రమైన, సామర్థ్యవంతమైన, బాధ్యతాయుతమైన ఏఐ వ్యవస్థ ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

## బ్రిటన్ మాజీ ప్రధానితో భేటీ కానున్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి దేశ రాజధాని ఢిల్లీ పర్యటనకు వెళుతున్నారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరనున్నారు. ఈ పర్యటన రెండు రోజుల పాటు కొనసాగనుంది. పర్యటనలో భాగంగా ఆయన పలు కీలక సమావేశాల్లో పాల్గొంటారని తెలుస్తోంది. ఇంగ్లండ్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్‌తో రేపు రేవంత్ సమావేశం కానున్నారు. ఈ భేటీలో ప్రధానంగా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. టోనీ బ్లెయిర్ ప్రస్తుతం 'టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ చేంజ్ (టీబీఐ)' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థను నడుపుతున్నారు. ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటోంది. ఈ నేపథ్యంలో, టీబీఐ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి అందగల సహకారం, పెట్టుబడుల అవకాశాలపై రేవంత్ రెడ్డి చర్చలు జరిపే వీలుంది. ఈ ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలతో కూడా సమావేశం అవుతారని తెలుస్తోంది. పార్టీలో ఇంకా భర్తీ కాకుండా పెండింగ్‌లో ఉన్న పదవులు, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి కీలకమైన సంస్థాగత అంశాలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో ఆయన చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వీటితో పాటు, పలువురు కేంద్ర మంత్రులను కూడా కలిసి, రాష్ట్రానికి సంబంధించిన వివిధ అభివృద్ధి అంశాలపై వినతిపత్రాలు సమర్పించి, చర్చించే వీలుందని సమాచారం. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి గత ఏడాదిన్నర కాలంలో పలుమార్లు ఢిల్లీలో పర్యటించారు. ఆయా సందర్భాల్లో పార్టీ పెద్దలతోనూ, కేంద్ర మంత్రులతోనూ సమావేశమై రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ వ్యవహారాలపై చర్చలు జరుపుతూ వచ్చారు. ఈ ప్రస్తుత పర్యటన కూడా రాష్ట్రానికి, పార్టీకి సంబంధించిన కీలక అంశాలపై జరగనుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఎనకటికి ఎవడో ఏదీ అడగకుంటే.. సచ్చిందాకా సాకుతా అన్నాడట: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పదవుల మీద ఉన్న ధ్యాస.. తెలంగాణ ప్రజలపై లేదంటూ కేటీఆర్ దుయ్యబట్టారు. ఎనకటికి ఎవడో ఏదీ అడగకుంటే.. సచ్చిందాక సాకుతా అన్నాడట.. ఆ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరు ఉందని కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా విమర్శించారు. "ఏస్తున్న రైతుభరోసా సరే. మరి ఎగ్గొట్టిన రైతుభరోసా సంగతి ఏంది..? ఎగ్గొట్టిన వడ్ల బోనస్ సంగతి ఏంది..? ఎగ్గొట్టిన తులం బంగారం, కళ్యాణలక్ష్మి పరిస్థితి ఏంటి..? ఎగ్గొట్టిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పరిస్థితి ఏంటి..? ఎగ్గొట్టిన రూ.2500 మహాలక్ష్మి పథకం పరిస్థితి ఏంటి..? ఆడబిడ్డలకు ఎలక్ట్రిక్ స్కూటీల పరిస్థితి ఏంటి..? ఆగిపోయిన రైతుబీమా పరిస్థితి ఏంటి..? ఆగిపోయిన రుణమాఫీ పరిస్థితి ఏంటి..?" అని కేటీఆర్ నిలదీశారు. శాసనసభ ఎన్నికల కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి, లోక్‌సభ ఎన్నికల కోసం దేవుళ్ల మీద ఒట్లేసి, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం రైతుభరోసా పేరుతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు కుటిల యత్నాలను తెలంగాణ గమనిస్తుంది. మీ పదవుల గ్యారంటీ కోసం ఉన్న శ్రద్ధ.. తెలంగాణ ప్రజలకు మీరిచ్చిన గ్యారంటీ కార్డు అమలుపై లేకపాయే అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# గోదావరి - బనకచర్లకు ఆనాడే అంకురార్పణ జరిగింది

మొదటి పేజీ తరువాయి

రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్టు నమస్తే తెలంగాణలో రాశారు అని సీఎం తెలిపారు. రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై విపక్షాలతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణకు గోదావరి, కృషా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్నారు. "21-9-2016న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించింది. ఏటా 3వేల టీఎంసీల నీరు వృథాగా గోదావరి నీరు సముద్రంలో కలుస్తోందని అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేసీఆర్ అన్నారు. 3వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయని మొదట మాట్లాడింది కేసీఆరే. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో అంతా దస్త్రాల రూపంలో ఉంది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై చర్చించుకున్నామని ఆనాడు తెలంగాణ, ఏపీ మంత్రులు మీడియాకు చెప్పారు. గోదావరి-బనకచర్లపై అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్నాం. నీటి ఒప్పందాలపై నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటాం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. గోదావరి-బనకచర్లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించాం. అన్ని పార్టీలను కలుపుకొని పోరాడుతాం. తెలంగాణకు కృష్ణాలో 299 టీఎంసీలు సరిపోతాయని ఆనాడు కేసీఆర్ ఒప్పుకొని సంతకం చేశారు. ఆనాడు కేసీఆర్ చేసిన సంతకం ఇవాళ తెలంగాణకు ప్రతిబంధకంగా మారింది" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

సీఎం వ్యాఖ్యలు ఖండించిన భారాస ఎంపీ

మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం తెలిపారు. ఆనాడు తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ మాట్లాడారని వివరణ ఇచ్చారు. కృష్ణానదిని కలుపుతూ గోదావరి జలాలు తీసుకెళ్తే అభ్యంతరం లేదని కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. సమావేశం పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో జరుగుతోందన్నారు.

# కూటమి గెలిచాక వారిని ఊరు విడిచి వెళ్లిపోమన్నారు

మొదటి పేజీ తరువాయి

తండ్రి ఎంత ప్రయత్నించినా కుమారుడిని కాపాడుకోలేకపోయారు" అని జగన్ ఆవేదనగా చెప్పారు.

"రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది"

రాష్ట్రంలో అభివృద్ధి గానీ, సంక్షేమం గానీ కనిపించడం లేదని, కేవలం 'రెడ్ బుక్ రాజ్యాంగం' మాత్రమే అమలవుతోందని జగన్ విమర్శించారు. "రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయనడానికి ఈ ఆంక్షలే నిదర్శనం. ఎన్నికల ఫలితాల సమయంలో తమకు అనుకూలమైన పోలీసు అధికారులను నియమించుకుని, కూటమిని గెలిపించుకోవడానికి అనేక అన్యాయాలకు పాల్పడ్డారు. ఈ విషయం ఈ ప్రాంత ప్రజలందరికీ తెలుసు" అని అన్నారు. నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడి చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆయన తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని జగన్ ఆరోపించారు. "నాగమల్లేశ్వరరావును బెదిరించిన ఆ సీఐపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? భార్య, కుమార్తె ఉన్న నాగమల్లేశ్వరరావు కుటుంబానికి చంద్రబాబు ఏం సమాధానం చెబుతారు? ఘటన జరిగి ఏడాది గడిచినా ఆ కుటుంబం ఇంకా శోకంలోనే ఉంది" అని జగన్ ప్రశ్నించారు. ఇదే నియోజకవర్గంలో లక్ష్మీనారాయణ అనే మరో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూడా పోలీసుల వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడని, ప్రస్తుతం ఆయన చావుబతుకుల మధ్య ఉన్నాడని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

## కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో మంత్రి లోకేశ్ భేటీ

మొదటి పేజీ తరువాయి



కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్ కు మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ తో మంత్రి లోకేశ్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... రాయలసీమలో రైతులు మామిడి, అరటి, టమోటా, బత్తాయి, దానిమ్మ, డేట్స్ వంటి పండ్ల తోటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. అయితే, పంట చేతికొచ్చే సమయంలో గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశాను. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా అక్కడి రైతులకు మెరుగైన రేట్లు లభించి ఆదాయం పెరిగే అవకాశం ఉంది. రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు సహకరించాలని లోకేశ్ కోరారు. దీనికి కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ స్పందిస్తూ... ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తిరుపతి ట్రిపుల్ ఐటీలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి తాను ఏపీకి వస్తున్నట్లు తెలిపారు. జులై 11, 12 తేదీల్లో రాయలసీమ పర్యటనకు వస్తున్నానని పాశ్వాన్ చెప్పారు. లోకేశ్‌ను కూడా ఆహ్వానించిన మంత్రి పాశ్వాన్.. క్షేత్ర స్థాయిలో పర్యటించి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై అధ్యయనం చేద్దామన్నారు. అన్నదాతలకు మేలు చేసేందుకు మోదీజీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. 'యువగళం' పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని లోకేశ్... చిరాగ్ పాశ్వాన్ కు అందించారు.

## నకిలీ కరెన్సీ కేసులో విదేశీయుడికి బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నో.. కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించి చలామణి చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు గండి కొట్టే ప్రయత్నం చేశాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న విదేశీయుడికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో అరెస్టయిన అతడికి బెయిల్ మంజూరు చేయడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఇటువంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని, ఇలాంటి వ్యక్తికి బెయిల్ ఇవ్వడం సరైంది కాదని స్పష్టం చేసింది. బల్గేరియా దేశానికి చెందిన రుస్లన్ పెట్రోవ్ మెతోదివ్ అనే వ్యక్తి భారత్‌లో నకిలీ కరెన్సీ నోట్లను ముద్రిస్తున్నాడన్న సమాచారంతో ఢిల్లీ పోలీసులు 2023లో అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో నిందితుడి నుంచి పెద్ద మొత్తంలో రూ. 500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 8 లక్షలు ఉంటుందని అంచనా. దీంతో పాటు, నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించే యంత్రాలు, ఇతర పరికరాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ నిందితుడు మొదట ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. అయితే, హైకోర్టు అతడి పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో రుస్లన్ పెట్రోవ్ సుప్రీంకోర్టు తలుపు తట్టాడు. రుస్లన్ పెట్రోవ్ బెయిల్ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ఇలాంటి నేరాలు ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నిందితుడిని పోలీసులు రూ.8 లక్షల నకిలీ కరెన్సీతో పట్టుకున్నారు. అతడిపై మోపబడిన నేరారోపణలు చాలా బలంగా ఉన్నాయి. ఒకవేళ నేరం రుజువైతే, అతడికి దీర్ఘకాలిక జైలుశిక్ష పడే అవకాశం ఉంది" అని కోర్టు పేర్కొంది. ఇంతటి తీవ్రమైన నేరానికి పాల్పడిన వ్యక్తికి బెయిల్ మంజూరు చేస్తే, అతడు సాక్ష్యాలను తారుమారు చేసే లేదా దేశం విడిచి పరారయ్యే అవకాశం ఉందని న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. "ఇలాంటి పరిస్థితుల్లో నిందితుడి అభ్యర్థనను ఆమోదించడం ఎంతమాత్రం సరికాదు" అని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. నకిలీ కరెన్సీ చెలామణి దేశ భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి ముప్పు వాటిల్లేలా చేస్తుందని, ఇలాంటి కార్యకలాపాలను ఉపేక్షించలేమని కోర్టు తేల్చి చెప్పింది.

## భారత్-పాక్ ఒప్పందంలో మీ ప్రమేయం లేదు

ఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తామే ఆపామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పదేపదే చాటుకున్న సంగతి తెలిసిందే. దీనిపై తీవ్ర చర్చే నడిచింది. ట్రంప్ ప్రకటనపై స్పష్టతనివ్వాలని అటు ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేశాయి. ఈక్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారిగా దీనిపై స్పందించారు. భారత్-పాక్ మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడికి స్పష్టంగా చెప్పినట్లు కేంద్ర విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. "జీ7 శిఖరాగ్ర సదస్సు అనుబంధంగా ప్రధాని మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగాల్సి ఉంది. అయితే, అమెరికా అధ్యక్షుడు ముందుగానే వెళ్లిపోవడంతో వీరు సమావేశం కాలేకపోయారు. అనంతరం వీరిద్దరూ 35 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత ట్రంప్.. మోదీకి ఫోన్ చేసి సంతాపం తెలియజేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అండగా ఉంటామన్నారు. ఆ తర్వాత నుంచి నుంచి వీరిద్దరూ మాట్లాడుకోవడం మళ్లీ ఇప్పుడే. కాబట్టి.. 'ఆపరేషన్ సిందూర్ ' వివరాలను ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడికి వివరించారు" అని మిస్రీ తెలిపారు. "పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్-అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరగలేదు. భారత్-పాకిస్థాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వానికి అంశంపైనా చర్చలు కూడా జరగలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్-పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి. పాక్ అభ్యర్థన మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశాం. ఇప్పుడు, ఎప్పుడూ.. భారత్ ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోదనే విషయాన్ని అమెరికా అధ్యక్షుడికి మోదీ స్పష్టంగా చెప్పారు. ఈ విషయంపై భారత్‌లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం ఉంది" అని మిస్రీ వివరించారు. ఇక కెనడా నుంచి తిరిగివెళ్తుండగా అమెరికా రావాలని ట్రంప్.. మోదీని ఆహ్వానించినట్లు మిస్రీ తెలిపారు. అయితే, ముందస్తు షెడ్యూల్ కారణంగా తాను రాలేనని భారత ప్రధాని వివరించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ద్వైపాక్షికంగా భేటీ కావాలని ఇరు దేశాధినేతలు నిర్ణయించినట్లు చెప్పారు. "భారత్‌లో జరిగే క్వాడ్ తదుపరి సమావేశం కోసం ట్రంప్‌ను మోదీ ఆహ్వానించారు. దీన్ని అంగీకరించిన అమెరికా అధ్యక్షుడు.. భారత్‌లో పర్యటించేందుకు ఉత్సుకతతో ఉన్నానని తెలిపారు" అని మిస్రీ వెల్లడించారు.


## రేవంత్ రెడ్డి ఆ పని చేస్తేనే నామినేషన్లు వేయనిస్తాం

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి రాకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షంలో ఎన్నికలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లకు అనుమతి తీసుకువస్తేనే నామినేషన్లు వేయనిస్తాం. లేదంటే ప్రతి వార్డులో వందల సంఖ్యలో నామినేషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేస్తాం" అని కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ, మండలిలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపామని, పార్లమెంటులో ఈ బిల్లును కేంద్రం ఆమోదించకపోతే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆమె తెలిపారు. "జులై రెండో వారం వరకు కేంద్రానికి గడువు ఇస్తున్నాం. ఆలోపు అనుమతి రాకపోతే జులై 17 నుంచి రైలు రోకోలు నిర్వహిస్తాం" అని కవిత హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు, బొల్లాపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అడ్డుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుల వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ఆపరేషన్ కగార్" పైన కూడా ఎమ్మెల్సీ కవిత స్పందించారు. ఈ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరపాలని ఆమె కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఎన్‌కౌంటర్లు అమానవీయ చర్యలని, ఈ ఆపరేషన్‌ను తమ పార్టీతో పాటు తెలంగాణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని కవిత పేర్కొన్నారు. మావోయిస్టు సమస్యకు చర్చలే పరిష్కారమని ఆమె అభిప్రాయపడ్డారు.

## ఫాస్టాగ్ వార్షిక పాస్.. ఇదో గేమ్ ఛేంజర్: పవన్ కల్యాణ్

జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ల వ్యవస్థపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం, భారత రహదారి మౌలిక సదుపాయాల ప్రస్థానంలో ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ 'ఎక్స్ (ట్విట్టర్)' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఫాస్టాగ్ వార్షిక పాస్‌లను ప్రవేశపెట్టాలన్న ప్రయాణికుల చిరకాల డిమాండ్‌కు ఈ నిర్ణయంతో సరైన పరిష్కారం లభించిందని పవన్ పేర్కొన్నారు. టోల్ చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఈ కొత్త విధానం ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "రూ.3000 వార్షిక పాస్‌తో వాహనదారులకు ఆర్థికంగా ఉపశమనం కలగడమే కాకుండా, దేశవ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, ఎలాంటి వివాదాలకు తావులేని విధంగా హైవే ప్రయాణం సాధ్యమవుతుంది" అని జనసేనాని పేర్కొన్నారు. ముఖ్యంగా టోల్ ప్లాజాల సమీపంలో నివసిస్తూ, తరచూ ప్రయాణించే వారికి ఈ విధానం వల్ల సమయంతో పాటు ఆర్థిక భారం కూడా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వానికి ప్రజాపాలన పట్ల ఉన్న నిబద్ధతకు నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం ఒక నిదర్శనమని పవన్ కొనియాడారు. కాగా, ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రూ.3000 చెల్లించి ఈ పాస్‌ను పొందవచ్చని ఆయన 'ఎక్స్ (ట్విట్టర్)' లో వెల్లడించారు. గడ్కరీ చేసిన ఈ పోస్టును రీట్వీట్ చేస్తూ పవన్ కల్యాణ్ పైవిధంగా స్పందించారు. అయితే, ప్రస్తుతం కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు వర్తించేలా కేంద్రం ప్రకటించిన ఈ పాస్‌కు సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు, వర్తించే నిబంధనలు ఇంకా వెలువడాల్సి ఉంది.

## అమిత్ షాతో మంత్రి నారా లోకేశ్ భేటీ



అమరావతి: ఏపీ మంత్రి నారా లోకేశ్ బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. ఈ భేటీ దాదాపు 25 నిమిషాల పాటు సాగింది. రాష్ట్రానికి సంబంధించిన అనేక కీలకమైన అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, కేంద్ర సహకారంతో అమలుచేస్తున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను లోకేశ్ వివరించారు. ఈనెల 21న విశాఖలో ప్రధాని మోదీ హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమానికి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ కొత్తప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని కోరారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని అమిత్ షాకు అందజేశారు. సుదీర్ఘ పాదయాత్రతో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన లోకేశ్‌ను అమిత్ షా ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు సుదీర్ఘ పాలన అనుభవం ఏపీని అభివృద్ధి బాటలో నడిపిస్తుంది, ఏపీలో డబుల్ ఇంజన్ సర్కారుకు కేంద్ర సహకారం కొనసాగుతుందని అమిత్ షా భరోసా ఇచ్చారు. ఈ సమావేశం అనంతరం లోకేశ్ మరికొందరు కేంద్ర మంత్రులను కూడా కలవనున్నట్లు సమాచారం. కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, అర్జున్‌రామ్ మేఘ్వాల్‌ను ఆయన కలవనున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా లోకేశ్ ఈరోజు ఉదయం భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో కూడా మర్యాదపూర్వకంగా భేటీ అయిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో వరుస భేటీలు నిర్వహిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# 6వ రోజు ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకర దాడులు..



## 609 మంది మృతి

**న్యూఢిల్లీ,:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య సైనిక వివాదం బుధవారం మరింత తీవ్రమైంది. వరుసగా ఆరో రోజు ఇరుపక్షాలు ఒకదానిపై ఒకటి భీకర క్షిపణి దాడులకు పాల్పడ్డాయి. ఇరుదేశాల వైమానిక దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 609 మంది ప్రాణాలు కోల్పోగా వందల మంది పౌరులు గాయపడ్డారు. ఇరాన్‌లో 585 మంది మరణించగా.. ఇజ్రాయెల్‌లో 24 మంది వైమానిక దాడుల కారణంగా చనిపోయినట్లు నివేదికలు వెల్లడించాయి. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇజ్రాయెల్‌పై ఫట్టా-1 హైపర్‌సోనిక్ క్షిపణిని ప్రయోగించినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ తో దాడుల్లో ఈ క్షిపణిని ఇరాన్ మొదటిసారి ఉపయోగించినట్లు అంతర్జాతీయ నివేదికలు తెలిపాయి. ఈరోజు తెల్లవారుజాము నుండి.. ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌పై క్షిపణులతో ఇరాన్ విరచుకుపడింది. దాదాపు 400 క్షిపణులను ప్రయోగించిందని.. వాటిని ఇజ్రాయెల్ అడ్డుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, అనుమానిత సైనిక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ టెహ్రాన్ సమీపంలో వైమానిక దాడులు కొనసాగిస్తోంది. కాగా, ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో చేరాలని డొనాల్డ్ ట్రంప్ ఆలోచిస్తున్నారని అమెరికా మీడియా నివేదించింది. దాంతోపాటు జీ7 శిఖరాగ్ర సమావేశం నుండి ట్రంప్ ఆకస్మికత్తుగా తిరిగి అమెరికా రావడంతో అమెరికా ఇజ్రాయెల్‌తో చేతులు కలుపుతుందనే ఊహాగానాలు మరింత బలపడ్డాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ మంగళవారం ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడారని.. అమెరికన్ యుద్ధ విమానాలను రంగంలోకి దింపనున్నట్లు అమెరికా అధికారులు ధృవీకరించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఎక్కడ దాకున్నాడో తమకు తెలుసని.. మర్యాదగా బయటకు వచ్చి లొంగిపోవాలని ట్రంప్ హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో ఖమేనీ.. యుద్ధం ప్రారంభమైందని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ తర్వాత ఇరాన్, ఇజ్రాయెల్ పై దాడులకు దిగింది.

# అది నిజమే.. నేను కూడా బాధితురాలినే: వైఎస్ షర్మిల



**హైదరాబాద్, :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ పై ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కీలక కామెంట్స్ చేశారు. తన ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందని ఆమె చెప్పారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన మాజీ ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు.. సుప్రీం ఆదేశాల మేరకు భారత్ కు వచ్చి సిట్ విచారణకు హాజరయ్యారు. ఇప్పటివరకు ఆయనను మూడుసార్లు విచారించిన అధికారులు.. ఈ కేసులో దూకుడు పెంచారు. మరోసారి ఈ కేసులో నిందితులైన ప్రణీత్ రావు వంటి వారిని మళ్లీ విచారిస్తూ కీలక సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్ షర్మిల ఫోన్ ట్యాపింగ్ పై స్పందించారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ నిజమేనని చెప్పారు. "బైబిల్ మీద ప్రమాణం చేసి చెప్తున్నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నది వాస్తవమే. నా ఫోన్, నా భర్త ఫోన్, నా దగ్గర వాళ్ల ఫోన్‌లు ట్యాప్ చేశారు. ఫోన్ ట్యాప్ జరిగినట్లు స్వయంగా వైవీ సుబ్బారెడ్డి నిర్ధారించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణకు ఎక్కడికి రమ్మని చెప్పినా వస్తా. ఫోన్ ట్యాపింగ్‌పై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు విచారణ వేగవంతం చేయాలి. తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్, జగన్ సంబంధం ముందు.. రక్తసంబంధం కూడా చిన్నబోయింది" అని షర్మిల పేర్కొన్నారు.

# డిజిటల్ సేఫ్టీ అనేది ఎంతో ముఖ్యం: రేవంత్ రెడ్డి



హైదరాబాద్: గూగుల్ ఆవిర్భావం నుంచి ప్రపంచం మారిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు మన జీవితం అంతా డిజిటల్‌తో ముడిపడిపోయిందని, డిజిటల్ సేఫ్టీ అనేది ఎంతో ముఖ్యమైన అంశమని వివరించారు. గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మన ఎకానమీ, గవర్నమెంట్ అన్ని డిజిటల్ అయ్యాయన్నారు. గ్లోబల్ కంపెనీలకు హైదరాబాద్ ఫస్ట్ ఛాయిస్ గా మారిందని, 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్‌గా మారుతుందని జోస్యం చెప్పారు. దేశ జిడిపికి తెలంగాణ 5 శాతం వాటా అందిస్తోందని, మహిళలను కోటీశ్వరులను చేసే పథకాలను చేపట్టామని, మహిళా సాధికారతకు గూగుల్ సహకారం ఆశిస్తున్నామని పేర్కొన్నారు. జిఎస్ఇసి హైదరాబాద్ లో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని స్పష్టం చేశారు. గూగుల్ అనేది ఇన్నోవేటివ్ కంపెనీ అని, మాది ఇన్నోవేటివ్ ప్రభుత్వం అని, నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశామని రేవంత్ వివరించారు. ఉత్తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ మారుతోందని, తెలంగాణ రైజింగ్‌లో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ మహిళలు ధనిక పెట్టుబడిదారులకు పోటీదారులుగా మారుతున్నారని కొనియాడారు. తమ ప్రభుత్వంలో నూతన ఆవిష్కరణలు, విధానాలు తీసుకొచ్చామని రేవంత్ స్పష్టం చేశారు.

# మూడవ వార్డులో సిసి రోడ్డు ప్రారంభం



వికారాబాద్ జిల్లా/ పరిగి (ఏపీ టుడే న్యూస్): పరిగి మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో సీసీ రోడ్డు ను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతి గ్రామంలో మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడం జరుగుతుందన్నారు. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎజాజ్, కాంగ్రెస్ నాయకులు తౌరియా నాయక్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందియాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి



పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షుడు టి రామ్మోహన్ రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ భూమన్న గారి పరుశురాం రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయూబ్, డిసిసి ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణ ప్రసాద్ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డ పల్లి కృష్ణ, మార్కెట్ డైరెక్టర్ శశికళ ఆనంద్, తాసిల్దార్ ఆనందరావు తో కలిసి ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు ప్రెసిడెంట్ ఆర్డర్ కాపీలను అందజేశారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని,ఇళ్లు రానివారు బాధపడొద్దు,



విడతలవారీగా అర్హులందరికీ ఇస్తాం అని,ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని అన్నారు.రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని,మిగులు రాష్ట్రంగా ఏర్పాటైన తెలంగాణను బీఆర్ఎస్ సర్కార్ అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు.కాంగ్రెస్ వచ్చాక ప్రతి నెలా వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలను సైతం కొనసాగిస్తున్నామని చెప్పారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రైతులకు రుణమాఫీ, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో పాటు యువతకు 59 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు.

వికారాబాద్ జిల్లా /పరిగి (ఏపీ టుడే న్యూస్): ఇల్లు లేని పేద ప్రజలందరికీ ఇండ్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం ఆశయమని పర్య ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఈరోజు పరిగి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్ మోహన్ రెడ్డి పరిగి మున్సిపాలిటి సంబంధించిన ఇందిరమ్మ 299 ఇళ్ల ప్రొసీడింగ్లను అందించారు. పేదవారికి సొంత ఇంటి కల నిజం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అరుణ ప్రతి ఒక్కరికి 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు కట్టియాలనే లక్ష్యంతో మొదటి విడతగా నియోజకవర్గానికి 3500 ఇండ్లను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ విడతలో ఇందిరమ్మ ఇండ్లు



రానివారికి రెండో విడతలో కచ్చితంగా అందిస్తామని తెలిపారు. ఇప్పటికే రెండు కోట్ల రూపాయలతో సిసి రోడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని. త్వరలో 25 కోట్ల రూపాయలతో డ్రైనేజీ , సిసి రోడ్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. పరిగి మునిసిపాలిటి అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నానని ఎమ్మెల్యే గారు తెలిపారు. పేదవారికి ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా ఉందని తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ఉచిత బస్సు వడ్డీ లేని రుణాలు సన్న బియ్యం 500 కే గ్యాస్ సిలిండర్ ఇందిరమ్మ ఇల్లు ఇలాంటి ఎన్నో పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఇప్పటికే రైతు రుణమాఫీ , రైతు భరోసా అందించామని వర్షాకాలం



రైతుల పెట్టుబడి సహాయ కొరకు ఇప్పటికే రైతుల ఖాతాలలో రైతు భరోసా ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు రైతు భరోసా వేస్తున్నామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి , పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయుబ్ ,పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ కమిషనర్ వెంకటయ్య, డిసిసి ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణ ప్రసాద్, హనుమంతు ముదిరాజ్,, నాయకులు అశోక్ అక్బర్, చిన్న నరసింహులు మహిపాల్ మాణిక్యం ఆనం ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, మల్లేష్ ,వెంకటేష్ , ఏజాజ్, వెంకటేష్, నస్కల్ ఇందిరమ్మ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీధర్,రామకృష్ణ రెడ్డి రామ్ రెడ్డి జగన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను కనడానికి ఆలోచిస్తున్న వైనం

### ఇప్పుడే వద్దు! ఇద్దరు చాలు!!
### వద్దనుకోవడం లేదా వాయిదాకు మొగ్గు
### ఆర్థిక, అనారోగ్య సమస్యలే ప్రధాన కారణం
### అమెరికా, భారత్‌లలో కొన్ని విషయాల్లో పోలికలు ఐక్యరాజ్యసమితి నివేదికలో ఆసక్తికర అంశాలు

'ఉద్యోగం / వ్యాపారంలో స్థిరపడాలి. ఆ తర్వాతే పెళ్లి, పిల్లలు'.. ఇంతేగా ఓ సగటు యువతీ, యువకుడి ఆలోచన. ఇదంతా పెళ్లికి ముందు. పెళ్లి తర్వాత వారి ఆలోచనల్లో చాలా మార్పులొస్తున్నాయి. ఇప్పుడే వద్దు అని చెప్పేవారు కొందరైతే.. ఇద్దరిని మించి పెంచలేం బాబోయ్ అంటున్నవారు మరికొందరు. పిల్లలను వద్దనుకోవడానికి లేదా వాయిదా వేయడానికే మొగ్గుచూపుతున్న జంటల సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా విద్యావంతులైన మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా చూస్తే.. ఆర్థిక, అనారోగ్య సమస్యలే పిల్లలను కనాలా వద్దా అన్న నిర్ణయం తీసుకోవడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది.

## అనారోగ్య సమస్యలు

వంధ్యత్వం, గర్భం దాల్చడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు భారత్‌లో 13 శాతం, అమెరికాలో 16 శాతం మంది వెల్లడించారు. పాలిసిస్టిక్ ఓవరీ సింద్రోమ్ (పీసీఓఎస్) వంటి హార్మోన్ల సమస్యలు, థైరాయిడ్, ఊబకాయం వంటివి సంతానోత్పత్తికి ఆటంకంగా

**పిల్లలు వద్దనుకోవడం లేదా పిల్లలను కనడం వాయిదా వేయడానికి కారణం (చెప్పినవారి శాతం)**

| | భారత్ | అమెరికా |
|---|---|---|
| ఆర్థిక పరిమితులు | 38 | 38 |
| నిరుద్యోగం, ఉద్యోగ అభద్రత | 21 | 17 |
| వంధ్యత్వం, గర్భం దాల్చడంలో ఇబ్బందులు | 13 | 16 |
| గర్భధారణ సంబంధిత వైద్య సంరక్షణ లేమి | 14 | 8 |
| నాణ్యమైన పిల్లల సంరక్షణ లేమి | 18 | 12 |
| భాగస్వామి తక్కువ మంది పిల్లలను కోరుకోవడం | 19 | 19 |
| తీవ్రమైన అనారోగ్య సమస్యలు లేదా వ్యాధులు | 15 | 12 |
| గృహ సంబంధ సమస్యలు (అధిక అద్దెలు, సరిపడా స్థలం లేకపోవడం వగైరా) | 22 | 15 |



మారుతున్నాయి. సమయపాలన లేని ఆహారపుటలవాట్లుబీ విధులు, ఉద్యోగంలో భాగంగా గంటల తరబడి కంప్యూటర్లకు అతుక్కుపోవడం, శారీరక శ్రమ లేమి, వంశపారంపర్యంగా వస్తున్న సమస్యలు కూడా తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. గర్భధారణ సమయంలో సరైన వైద్య సంరక్షణ లేకపోవడం కారణమని భారత్‌లో 14 శాతం, యూఎస్‌లో 8 శాతం మంది తెలిపారు. గర్భం వచ్చిన తర్వాత తల్లి, బిడ్డ ఆరోగ్యం కోసం క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించాలి. వారు సూచించిన పరీక్షలు చేయించడంతోపాటు, మందులు వాడాలి. ఈ ప్రక్రియను ఆర్థికంగా భారంగా భావించడమో, లేదా వైద్య సౌకర్యాలు లేకపోవడమో కారణంగా.. మాతృత్వాన్ని కాదనుకోవడమో, వాయిదా వేయడమో చేస్తున్నారు.

## చూసుకునేవారు లేక..

తగినంత/నాణ్యమైన పిల్లల సంరక్షణ అవకాశాలు లేకపోవడం కారణమని భారత్‌లో 18 శాతం, అమెరికాలో 12 శాతం మంది తెలిపారు. అంటే పిల్లలను చూసుకోవడానికి పెద్దవారు అందుబాటులో లేకపోవడం, సంరక్షణ కేంద్రాల లేమి.. కుటుంబాలను గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. పిల్లలను చూసుకునేవారు లేకపోతే తల్లిదండ్రులు పని చేయడం కష్టతరం అవుతుంది. వారి ఆర్థిక స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా మహిళలు ఉద్యోగాలకు దూరం కావడానికి దారితీస్తుంది. ఇలాంటి కారణాలతో భాగస్వామి తక్కువ మంది పిల్లలను కోరుకోవడమూ ప్రధాన కారణమని భారత్, యూఎస్‌లలో 19 శాతం మంది వెల్లడించారు. మనదేశంలో జననాల రేటు 1960లలో సగటున ఒక్కో మహిళకు సుమారు 6గురు పిల్లలుగా ఉండేది. ఇప్పుడు ఇది 1.9కి పడిపోయింది. అంటే ఇద్దరు పిల్లలు కూడా కాదన్నమాట. ప్రపంచ సగటు 2.2తో పోలిస్తే ఇది తక్కువే. ఇందుకు ఆర్థిక పరిమితులు, ఉద్యోగ అభద్రత, అనారోగ్య సమస్యలు... ఇలా ఎన్నో కారణాలు. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) రూపొందించిన 'స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ 2025' నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ప్రపంచ జనాభాలో 37 శాతం మంది ఉన్న భారత్, అమెరికా వంటి 14 దేశాల్లో ఈ సర్వే నిర్వహించారు.

## ఇద్దరు చాలంటున్నారు

ఎంతమంది పిల్లలు కావాలని అడిగితే ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది చెప్పిన సమాధానం.. ఇద్దరు! మనదేశంలో అసలు పిల్లలే వద్దన్నవారు సగటున 5 శాతం కాగా, ఇది అమెరికాలో సుమారు 14 శాతం కావడం గమనార్హం. ఒక్కరే చాలని మనదేశంలో సగటున 14 శాతం మంది చెబితే.. అమెరికాలో కేవలం 7 శాతం మందే ఇలా కోరుకున్నారు. ఇద్దరు బిడ్డలు కావాలని మనదేశంలో పురుషుల్లో 33 శాతం, మహిళల్లో 41 శాతం మంది చెప్పారు. అమెరికాలో ఇలా కావాలన్నవారి సగటు కేవలం 26 శాతమే. మనదేశంలో ముగ్గురు లేదా నలుగురు పిల్లలు కావాలన్నవారు స్త్రీ, పురుషుల్లో గరిష్ఠంగా 6 శాతాన్ని కూడా మించలేదు. ఆసక్తికరంగా అమెరికాలో ఇలా కావాలన్నవారు దాదాపు 16 శాతం.

## ఆర్థిక పరిమితులు

భారత్, అమెరికాలో ఆర్థిక పరిమితులే ప్రధానంగా మాతృత్వానికి అడ్డంకిగా ఉన్నాయని 38 శాతం మంది వెల్లడించారు. ఆదాయ అసమానతలు, అప్పులు పేరుకుపోవడం, ఊహించని ఖర్చులు, ఉద్యోగ భద్రత లేకపోవడం, నిరుద్యోగం, పొదుపు లేకపోవడం లేదా సరైన ఆర్థిక ప్రణాళిక లేకపోవడం వంటి ఆర్థిక పరిమితులు చుట్టుముడుతున్నాయి. ఈ సవాళ్లే కుటుంబ జీవితంలోని వివిధ అంశాలను.. ప్రధానంగా బిడ్డలను కనాలన్న నిర్ణయాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. పిల్లలను వద్దనుకోవడానికి.. నిరుద్యోగం లేదా ఉద్యోగం పోతుందేమోనన్న అభద్రతాభావం కారణమని 21 శాతం భారతీయులు, 17 శాతం అమెరికన్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా జాబ్ మార్కెట్‌లో అనిశ్చితి ఒకవైపు.. ఏఐ వంటి నూతన సాంకేతికత రాకతో కొన్ని రంగాలకు చెందిన పలు విభాగాల్లో ఉద్యోగుల తీసివేతలు మరోవైపు.. వెరసి యువతకు ఉద్యోగాలు, కొత్త అవకాశాల వేట తప్పడం లేదు. ఇవన్నీ కూడా పిల్లలను కనాలా వద్దా అన్న నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయి.



## మానవీయ కోణంలో కొల్లేరు సమస్యకు పరిష్కారం చూపండి

కేంద్ర కమిటీకి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి.

సెంట్రల్ ఎంపవర్మెంట్ కమిటీకి తన కార్యాలయం ప్రతినిధుల ద్వారా సమగ్ర నివేదిక సమర్పించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్..






ఏలూరు, (ఏపీ టుడే న్యూస్): దీర్ఘకాలికంగా నెలకొన్న కొల్లేరు సమస్యకు మానవీయ కోణంలో శాశ్వత పరిష్కారం చూపించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర కమిటీకి విజ్ఞప్తి చేశారు. కొల్లేరు సమస్యను అధ్యయనం చేసేందుకు మూడు రోజుల పర్యటనలో భాగంగా ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో బుధవారం వినతులు స్వీకరించిన సెంట్రల్ ఎంపవర్మెంట్ కమిటీకి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన కార్యాలయం ప్రతినిధుల ద్వారా సమగ్ర నివేదిక సమర్పించారు. కొల్లేరు ప్రాంత వాసులు తమ జీవనోపాధి కొరకు వారి కోరిక మేరకు జిరాయితి, డి. ఫామ్ పట్టా, మత్స్యకారుల సొసైటీ భూములు, గ్రామాల్లో మంచినీటి చెరువులు, పశువుల చెరువులు, నివేశన స్థలాలు, స్మశాన వాటికలు, ఆటస్థలాలు, ఆసుపత్రులు, ప్రభుత్వ పాఠశాలలు, ఇతర సామాజిక అవసరాలకు సంబంధించిన భూములను పక్షుల అభయారణ్యం నుంచి తొలగించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన నివేదికలో కోరారు. కొల్లేరు ప్రాంత వాసులు, రైతుల మనోభావాలను గౌరవిస్తూ వారికి తగిన న్యాయం చేయాలని తన నివేదిక ద్వారా ఎంపీ పుట్టా మహేష్ కుమార్








## ఆండారెడ్డిపల్లి మాతమ్మ జాతరకు పదివేలు విరాళం అందించిన శ్రీ ఇండస్ట్రీస్ అధినేత ఎం. ఈశ్వర్ నాయుడు



చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం జూన్ 18.(ఏపీ టుడే న్యూస్): చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజవర్గం బంగారుపాలెం మండలం తగ్గువారి పల్లి పంచాయతీ ఆండారెడ్డిపల్లి గ్రామంలోని మాతమ్మ జాతరకు శ్రీ ఇండస్ట్రీస్ అధినేత ఈశ్వర్ నాయుడు బుధవారం పదివేలు రూపాయలు విరాళంగా అందించారు. ప్రతి సంవత్సరం ఇదేవిధంగా మాతమ్మ జాతరకు విరాళం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో,బుజ్జి నాయుడు, నరేష్, పాల్గొన్నారు.

## ఆండారెడ్డిపల్లి మాతమ్మ జాతరకు పదివేలు రూపాయలు విరాళం అందించిన ఎన్ఆర్ఐ వల్లేరు కళ్యాణ్



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం న్యూస్ జూన్ 18.(ఏపీ టుడే న్యూస్): చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజవర్గం బంగారుపాలెం మండలం తగ్గువారి పల్లి పంచాయతీ ఆండారెడ్డిపల్లి గ్రామంలోని మాతమ్మ జాతరకు ఎన్ ఆర్ ఐ వల్లేరు కళ్యాణ్ బుధవారం పదివేలు రూపాయలు విరాళంగా ఇచ్చారు.ప్రతి సంవత్సరం ఇదేవిధంగా మాతమ్మ జాతరకు విరాళం అందిస్తామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో,బుజ్జి నాయుడు, నరేష్, పాల్గొన్నారు.

## గుంతూరు గ్రామపంచాయతీలో పాల్గొన్న పలమనేరు ఆర్డిఓ భవాని





చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం జూన్ 18.(ఏపీ టుడే న్యూస్): చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం గుంతూరు,తిమ్మోజి పల్లి గ్రామపంచాయతీలలో పలమనేరు ఆర్డీవో భవాని బుధవారం మండల తాసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పాల్గొన్నారు. మండలంలోని రైతులు మామిడి పంటలో ఎదుర్కొంటున్న సమస్యలపై ఆమె రైతులతో ఆరా తీశారు. ఇలా రైతులు నష్టపోవడం ఎప్పుడు జరగలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా 12 రూపాయలు నిర్దేశిత రేటు ప్రకటించిన కొంతమంది కలెక్టర్ ను బేఖాతరు చేస్తూ రైతులను మోసగిస్తూ వ్యాపారాలు సాగిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ నిర్దేశించిన రేటుకు రైతుల నుండి కొనుగోలు చేయాలని ఆమె పేర్కొన్నారు. కొన్నిచోట్ల రాంపులను పరిశీలించారు. రైతులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల తాసిల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రహ్మానంద నగర్ లో రోడ్లు, డ్రైన్లకు. శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గొల్లపల్లి



పాండిచ్చేరి, యానం, ఏపీ టుడే న్యూస్( జూన్ 18): యానాం బ్రహ్మానంద నగర్ కాలనీ లో రోడ్లు, డ్రెయిన్ల కి నిర్మాణనికి సంబంధించి ఎంపీ నిధుల నుండి సుమారు రూ.54.000,00/ (ఏభై నాలుగు లక్షల రూపాయలు) స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేతుల మీదుగా భూమి పూజ చేయడం జరిగింది ఎన్నో ఏళ్లుగా అక్కడ ఉన్న ప్రజలు రోడ్లు మరియు డ్రెయిన్లు లేక ఇబ్బందులు పడుతున్న వారికి ఉపశమనం గా ఉంటుందని అడిగిన వెంటనే నిధులు కేటాయించి రోడ్లు వేసేందుకు సహకరించినందుకు ఆ గ్రామ ప్రజలు స్థానిక శాసన సభ్యులు గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కి మరియు ఎంపీ సెల్వ గణపతి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏ ఇ కాళ్ళ నాగరాజు, జె ఇ లు జ్యోతి రాజు, ప్రసాద్ లు మరియు గొల్లపల్లి అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారులి.

# అధికారులు పై మండిపడ్డల ఎమ్మెల్యే గొల్లపల్లి









యానం, పాండిచ్చేరి(ఏపీ టుడే న్యూస్): యానం స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఈరోజు ప్రజా పనుల శాఖ లో జరిగిన సమావేశంలో అధికారులు తీరును ప్రశ్నిస్తూ వారిపై మండిపడ్డారు ముఖ్యంగా యానంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు వాళ్ళు ప్రజల్ని ఏ విధంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గత ఫిబ్రవరి నెల నుండి ఆది ద్రావిడ సంక్షేమ శాఖ ద్వారా వచ్చిన నిధుల మరియు ఎమ్మెల్యే నిధుల నుండి అంతేకాకుండా ఇతర ఎమ్మెల్యేలు ఎంపీ నిధులు తీసుకొచ్చి ఆయా గ్రామాలలో రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసేందుకు తాను కృషి చేస్తుంటే అధికారులు మాత్రం మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు చెప్పు చేతల్లో కీలుబొమ్మలగా వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటని ఇలాంటి వ్యవహారాలు ప్రజలు చూస్తూ ఊరుకోరని అధికార్లు కేవలం ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటూ ప్రజలకు పనులు చేయకుండా వ్యవహరించడం సరైనది కాదని హెచ్చరించారు. గతంలో మాజీ మంత్రి ఒక ప్రకటనలో తెలిపిన విధంగా సి ఎస్ ఆర్ నిధులకు సంబంధించి తాను మంత్రి గా ఉన్నప్పుడు సి ఎస్ ఆర్ నిధులు కోసం కృషి చేశారని చెప్పి వాటికి సంబంధించి పనులకు మరియు భూమి పూజలకు తను పాల్గొంటానని ఇతర పనులలో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పిన విషయం అధికారులు మరిచిపోయారు అదేవిధంగా మల్లాడి అనుచరులు కూడా మరిచిపోయి చాలా కాలం అయినట్టుంది. నేను పుదుచ్చేరి రాజ్యసభ ఎంపీ నిధుల నుండి సుమారు 55 లక్షల రూపాయలు అభివృద్ధి పనులకు నిధులు తీసుకొస్తే దానికి సంబంధించిన భూమి పూజకు మల్లాడి వచ్చేవరకు ఆపాలని పరిపాలన అధికారి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఆశస్పదమన్నారు. నేను తెచ్చిన నిధులు కి సంబంధం లేని వ్యక్తి వచ్చి పాల్గొంటాను అంటే సహించేది లేదని హెచ్చరించారు.

1.తెలుగువారి పట్ల చిన్న చూపు చూస్తున్న ముఖ్యమంత్రి కి మరియు పరిపాలన అధికారి తొమ్మిది వందల కిలోమీటర్లు దూరంలో ఉన్న యానాం ప్రజలు పై ముఖ్యమంత్రికి అదేవిదంగా పరిపాలన అధికారి కి ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తున్నారని ప్రజలు అంత గ్రహిస్తున్నారనీ ప్రజలు కోసం నేను నిధులు సమకూరిస్తే అభివృద్ధి పనులు చేయకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారనీ అసలు మీకు పనులు చేయకుండని ఎవరైనా ఆదేశాలు ఇస్తున్నారా చెప్పండని ప్రశ్నించారు. మిగిలిన 29 నియోజక వర్గాల లేని విధంగా యానాం ప్రజలను అంధకారంలో పెట్టి పాలన చేస్తున్నారని, యానాం ప్రజలపై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

2. ప్రొటోకాల్ పై వివరణ

యానాంలో ప్రొటోకాల్ కోసం ఇదే పరిపాలన అధికారి తన కార్యాలయం నుండు గత మూడున్నర ఏళ్ళు క్రితం ఒక ఒక పుదుచ్చేరి ప్రభుత్వాన్ని వివరణ కోరడం జరిగింది దానికి సంబంధించి ఇంతవరకు తిరిగి సమాధానం కూడా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ పరంగా తనకు ప్రొటోకాల్ ఉంటే దానికి గౌరవిస్తాను ఎన్నో సార్లు చెప్పడం జరిగింది. ఈ రోజు ఫోన్ ద్వారా సంధించిన అధికార్లు నీ పరిపాలన అధికారి అడిగి తెలుసుకోగా సంబంధించిన ఫైల్ ఎక్కడ ఉందో చూసి వారంలో రోజుల్లో వివరణ ఇస్తాం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు మూడున్నర ఏళ్ళు క్రితం పంపిన ఫైల్ ఇంతవరకు ఎక్కడుందో తెలియని పరిస్థితి కనపడుతుంది.

3. పరిపాల అధికారిగా మీరు అర్హులు కాదు

పరిపాలన అధికారి గా మీరు అర్హులు కాదని రాజీనామా చేసి ఇంటికి పోవాలని మీరు చేసే పనులకు ప్రజలు ఇబ్బందులు ఎందుకు పడాలని ప్రశ్నించారు.

4.శ్రీకారం చుట్టిన పనులు పూర్తి కాని వైనం గత జనవరి జరిగిన ప్రజా ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అనేక అభివృద్ధి పనులు కి శ్రీకారం చుట్టిన కానీ ఇంతవరకు పనులు పూర్తి కాని వైనం అంటే యానాం ప్రజలు మీద ప్రభుత్వం ఈ విధంగా కక్ష సాధింపు చేస్తుందో అర్థం అవుతుంది.

5. అనేక రివ్యూ మీటింగ్ లు జరిగిన కానీ ఏమి ఉపయోగం ఇదే పరిపాలన అధికారి కార్యాలయంలో అనేక రివ్యూ మీటింగ్ లు జరిగిన కానీ పనులు మాత్రం శూన్యం ఒక శాసన సభ్యులు కన్నా మాజీ మంత్రి మల్లాడి నీ ఎక్కడ మీటింగ్లు పెట్టారని ఆయన కాని ఎందుకు పనులు చేయలేదు, అంటే మాజీ మంత్రి పనులు చేయద్దు అని ఏమైనా ఆదేశాలు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. నేను ఇంతవరకు పరిపాలన విభాగంలో జోక్యం చేసుకోలేదని ఏ ఒక్క ప్రభుత్వ అధికారులను ఇబ్బంది పెట్టింది లేదని, ప్రజలకి మంచి జరిగితే చాలని ఎదురు చూడడం జరిగిందని కాని ఈ రోజు చూస్తున్న పరిస్థితులని బట్టి చూస్తే పనులు జరగకుండా ఎవరు అడ్డుపెడుతున్నారు అనేది పూర్తిగా అర్థం అయింది. పరిపాలన అధికారి మాత్రం మాజీ మంత్రి నీ తన కారు లో ముందు సీట్లో కూర్చోపెట్టుకుని మరీ పనులు చేస్తున్నట్లు బిల్డప్ కానీ ఎక్కడి పనులు అక్కడే మొదలు పెట్టకుండా వ్యవహరించడం. ఈ ఐదు సంవత్సరాలలో ప్రజలు అభివృద్ధి జరిగితే ఎక్కడ తనకు పేరు వస్తుందని కక్షతో ఈ విధంగా వివక్ష చూపిస్తున్నారని తెలుస్తుంది. ఈ సమావేశములో పరిపాలన అధికారి ఆర్ మునిస్వామి, ఏ.ఇ.కాళ్ళ నాగరాజు, ప్రసాద్, జ్యోతి రాజు పాల్గొన్నారు.

# పక్కా పత్రాలున్నా భూములకు రిజిస్ట్రేషన్ నిషేధం అన్యాయం

### కాకినాడ రూరల్‌లోని నివాసిత ప్రాంతాల భూములపై నిషేధం ఎత్తివేయాలని ప్రజల డిమాండ్.....



కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం, ఏపీ టుడే న్యూస్ (జూన్ 18): గత వైసీపీ ప్రభుత్వం కాలంలో పక్కా దస్తావేజులు కలిగిన పలు నివాసిత భూములను దేవాదాయ శాఖ ఈనాం భూములుగా పేర్కొంటూ రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితాలో చేర్చిన నేపథ్యంలో, తాజా ప్రభుత్వం ఈ నిషేధాన్ని ఎత్తివేసి ఆయా భూములకు చట్టబద్ధత కల్పించాలని స్థానిక నివాసితులు కోరుతున్నారు. శశిధర్ కోలనీ, ఇన్కమ్ టాక్స్ కొలనీ, మౌర్య నగర్, పోస్టల్ ఎంప్లాయిస్ కోలనీ, జనచైతన్య కోలనీ, ఇతర ప్రైవేట్ యజమాన్య భూములపై ఇటీవలి సంవత్సరాల్లో 22(%ూ)(1)(ఎ%) చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ నిషేధం విధించబడింది. అయితే ఈ చట్టం మేరకు దేవాదాయ శాఖకు చెందిన ఈనాం భూములు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండవలసి ఉండగా, ఇప్పటికే దశబ్దాల కాలం నుంచి దస్తావేజులు, పక్కా సర్వే పత్రాలు, భవన నిర్మాణ అనుమతులు ఉన్న భూములను కూడా ఈ జాబితాలో చేర్చడం స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ నేపథ్యంలో ఆయా కాలనీల ప్రతినిధులు మరియు ప్రైవేట్ భూ యజమానులు కలిసి స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీని కలసి విజ్ఞప్తి చేశారు. తాము ఎన్నో ఏళ్లుగా ఇక్కడ నివసిస్తున్నామని, ప్రభుత్వ ఆదాయ పన్ను, ఆస్తిపన్నులు చెల్లిస్తూ వస్తున్నామని వారు తెలిపారు. ఈ చట్టం ప్రకారం దేవాదాయ శాఖకు చెందిన ఈనాం భూములు వ్యక్తిగతంగా విక్రయించరాదు. అయితే అనేక ప్రాంతాల్లో ఈనాం భూములుగా పేరుతో ఉన్న భూములు అసలు అధికారికంగా ఇవ్వబడని పత్రాల ద్వారా మాత్రమే గుర్తించబడ్డాయి. వాటిని నివాసిత స్థలాలుగా ఉపయోగిస్తూ అనేకమంది పన్నులు చెల్లిస్తూ నివసిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, ఈ అన్యాయానికి చరమాంకం పెడుతూ ఈ రిజిస్ట్రేషన్ నిషేధాన్ని ఎత్తివేసి ఆయా భూములకు చట్టబద్ధత కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల తరపున ఎమ్మెల్యే పంతం నానాజీ ఈ సమస్యను ప్రభుత్వస్థాయిలో తీసుకెళ్లి త్వరితంగా పరిష్కరించేందుకు హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడి సత్యనారాయణ, సూరంపూడి విశ్వవేశ్వరరావు, కొనాడ కృష్ణ, నామన శంఖరరావు, వి. ఎస్. ఫణి కుమార్, వి నాగేశ్వరరావు, వి. వెంకట్రావు, దామెర శ్రీనివాస రాజు, పి. వి. ఎస్ ఆర్ కె రాజు, పి ఎస్ ఎన్ రాజు, భావన్నా రాయణ పురం జనసేన పార్టీ నాయకులు శీలం వెంకరమణ తదితరులు ఉన్నారు.

## భైరవమూర్తికి పలువురు పరామర్శ



కాకినాడ జిల్లా,తాళ్లరేవు మండలం, ఏపీ టుడే న్యూస్ ( జూన్ 18): ఇటీవల హైద్రాబాద్లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్సీపీ నాయకుడు పొన్నాడ భైరవమూర్తిని బుధవారం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్కుమార్ పలువురు నాయకులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీసారు. పరామర్శించినవారిలో పార్టీ ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ దడాల జగదీష్, నాయకులు నందికోళ్ల శ్రీమన్నారాయణ, చిట్టూరి చలపతి, నీలపాల శ్రీను, చెక్కా వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## కోరింగా అభయారణ్యంలో ట్రైనీ ఐఏఎస్లు



కాకినాడ జిల్లా,తాళ్లరేవు మండలం, ఏపీ టుడే న్యూస్ ( జూన్ 18): కోరింగ అభయారణ్యాన్ని బుధవారం ఏడుగురు ట్రైనీ ఐఏఎస్ లు సందర్శించారు. వారు అభయారణ్యంలోని ప్రముఖ ప్రదేశాలను ఆసక్తిగా తిలకించారు. మడ చెట్ల అందాలను తిలకిస్తూ చెక్కల వంతెనపై నడుస్తూ ఆనందం వ్యక్తం చేసారు. అనంతరం ఉత్సాహంగా బోటు షికారు చేసారు. అభయారణ్యంలో మడ అడవుల విశిష్ఠిత, పక్షుల తదితర వివరాలను ఫారెస్ట్ రేంజర్ ఎస్-ఎస్ఆర్ వరప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు కె.సిద్ధార్థ, వీరభద్రరావు, ఎఫ్బీఓ జి.గోపి నాగేంద్రకుమార్, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, కె.ధనుంజయరావు, సీబీఈటీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




## కోరంగి పంచాయతీకి స్మశాన స్థలం అప్పగింత



కాకినాడ జిల్లా,తాళ్లరేవు మండలం, ఏపీ టుడే న్యూస్ ( జూన్ 18): కోరంగి పంచాయతీ పరిధిలో జరుగుతున్న రీసర్వేలో భాగంగా బుధవారం స్మశాన స్థలాన్ని పంచాయతీకి అప్పగించినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి విజెవి రమణ తెలిపారు. తహసీల్దార్ పితాని త్రినాధరావు ఆదేశాల మేరకు స్థానిక నాయకుల సమక్షంలో స్మశాన స్థలాన్ని సర్వే చేయించి మక్కులు వేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు టి.ఈశ్వరరావు, అత్తిలి బాబూరావు, పెయ్యల శ్రీనివాస్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఫోటో : కోరంగిలో స్మశాన స్థలాన్ని సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

## రేపు కాకినాడ ఫ్యాబిన్ హాల్ లో కైట్ అవగాహనా సదస్సు



కాకినాడ జిల్లా,తాళ్లరేవు మండలం,(ఏపీ టుడే న్యూస్): (జూన్ 18): కైట్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ కాకినాడ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ శుక్రవారం కాకినాడలో ఎప్సెట్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు కైట్ డైరెక్టర్ వై.సత్తిరాజు, ప్రిన్సిపాల్ వై. రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసారు. కాకినాడ కుళాయి చెరువు దగ్గరగల వివేకానంద పార్క్ చెంతనగల ఫ్యాబిన్ కాన్వోకేషన్ హాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించే సదస్సుకు జెఎన్టీయూకె మాజీ వైస్ ఛాన్సలర్ డా. కెవిఎస్ జీ మురళీకృష్ణ హాజరై విద్యార్థులకు ఇంజనీరింగ్ అవకాశాలు, గేట్ ప్రాముఖ్యత, ప్రభుత్వ ఉద్యోగావకాశాలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అదేవిధంగా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రదీప్ కొండిపర్తి హాజరై విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాల ఎంపికలో తీసుకోవాల్సిన ముఖ్య విషయాలు, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం. అందిపుచ్చుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కైట్ వైస్ ప్రిన్సిపాల్, డీన్ డా.రామ్ కిరణ్, మధు కోరుతున్నారు.



## ఎన్ని కుయుక్తులు పన్నినా.. జగన్ ప్రవాహాన్ని అడ్డుకోలేరు!



**అమరావతి,:** రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యం చెందిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జగ్గంపూడి రాజా అన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న జనాన్ని చూసి ఓర్వలేక పోలీసులు ఆంక్షలు విధించారని మండిపడ్డారు. ఎన్ని కుయుక్తులు పన్నినా.. జగన్ ప్రవాహాన్ని అడ్డుకోలేరన్నారు. గతంలో ఎవరు ఇన్ని ఆంక్షలు పెట్టలేదని ఫైర్ అయ్యారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, అవసరం వచ్చినప్పుడు సరైన గుణపాఠం చెబుతారు అని జగ్గంపూడి రాజా పేర్కొన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో మాజీ సీఎం వైఎస్ పర్యటిస్తున్నారు. అయితే ఈ పర్యటనపై పోలీసులు ఆంక్షలు విధించారు. జగన్ కాన్వాయ్‌తో పాటు మూడు వాహనాలు, వంద మందికి మాత్రమే పోలీసులు అనుమతిచ్చారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే జగ్గంపూడి రాజా మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యం చెందింది. రాష్ట్రంలో వైఎస్ జగన్‌కు వస్తున్న జనాన్ని చూసి ఓర్వలేక పోలీసులు ఆంక్షలు పెట్టారు. ఎన్ని కుయుక్తులు పన్నినా జగన్ ప్రవాహాన్ని అడ్డుకోలేరు. గతంలో ఎవరు ఇన్ని ఆంక్షలు పెట్టలేదు. మీ పరామర్శలకు ఇన్ని ఆంక్షలు ఉన్నాయో ఓసారి గుర్తుచేసుకోండి' అని అన్నారు. 'కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సంక్షేమ పథకాలను తెప్ప తగలేశారు.సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం డబ్బులు ఏవి?. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి. ఈనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై జిల్లా కలెక్టరేట్ల ఎదుట ఆందోళన చేస్తాం. వాలంటీర్ల నెత్తిన శఠగోపం పెట్టారు. ఎండీయూ వాహనాలను తొలగించి రేషన్ కోసం ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు' అని జగ్గంపూడి రాజా మండిపడ్డారు.